క్లుప్తంగా

వయ్యారి భామ మొక్కలు నిర్మూలించాలి



రామవరప్పాడు: వయ్యారి భామ కలుపు మొక్కలను నిర్మూలించాల్సిన బాధ్యత మనం దరిపై ఉందని నిడమానూరు సర్పంచ్ శీలం రంగారావు అన్నారు. విజయవాడ రూరల్ మండలం నిడమానూరులో బుధవారం వయ్యారి భామ కలుపు మొక్కలను పెకిలించి దహనం చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ అంకం రామకృష్ణ, ఎంపీటీసీ, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి ప్రకాష్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వార్షిక క్రీడా మహోత్సవం



ఉంగుటూరు: మండలంలోని తేలప్రోలులో ఉషారామ ఇంజినీరింగ్ కళాశాలలో 15వ వార్షిక క్రీడా మహోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ప్రముఖ క్రీడాకారిణి పోలినేని పద్మజా బాల క్రీడా జ్యోతి ప్రజ్వలన చేసి మార్చ్‌పాస్ట్ చేసి ప్రారంభించారు. కళాశాలలోని ఎనిమిది విభాగాల నుంచి విద్యార్థిని, విద్యార్థులు క్రీడల్లో ఉత్సాహంగా పాల్గొని ప్రతిభను చాటారు. ఆటల పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరచి విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందజేశారు. కళాశాల చైర్మన్ సుంకర రాంబ్రహ్మం, డైరెక్టర్ కె.రాజశేఖర్, ప్రిన్సిపాల్ ప్రసాద్ విజేతలను అభినందించారు.

మొక్కల సంరక్షణ అందరి బాధ్యత

హనుమాన్‌జంక్షన్ రూరల్: సర్వమానవాళికి ప్రాణవాయువును అందించే మొక్కలను సంరక్షించే బాధ్యత అందరిపై ఉందని ఉషారామ ఇంజినీరింగ్ కాలేజి ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ వి.శ్రీహరిబాబు అన్నారు. బాపులపాడు మండలం వీరవల్లిలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు నిర్వహిస్తున్న క్యాంపులో భాగంగా బుధవారం ప్రభుత్వ కార్యాలయాలు, ప్రధాన రహదారుల వెంట విద్యార్థులు మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణకు మొక్కలను నాటి, వాటిని సంరక్షించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, వ్యక్తిగత మరుగుదొడ్లు వినియోగించాలని నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. సర్పంచ్ పిల్లా అనిత, వైఎస్సార్ సీపీ నాయకుడు కొడెబోయిన బాబి పాల్గొన్నారు.

వాకర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా వీసం

గన్నవరం: వాకర్స్ అసోసియేషన్ నూతన ప్రధాన కార్యదర్శిగా వీసం ప్రసాదరావు ఎన్నికయ్యారు. స్థానిక జెడ్పీ బాలురోన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో బుధవారం వాకర్స్ అసోసియేషన్ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడిగా బెజవాడ ప్రసన్నాంజనేయులు, ట్రాక్ కన్వీనర్‌గా షేక్ మున్వర్ అహ్మద్, సంయుక్త కార్యదర్శిగా టంకాల జగన్ ఎన్నికయ్యారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా మడుపల్లి బాలకృష్ణమూర్తి, జిల్లా సంయుక్త కార్యదర్శులు ముక్కామల సుబ్బారావు, కేఎస్ బాబూరావు, వ్యవస్థాపక కార్యదర్శి టీఎస్ఆర్కే ప్రసాద్, ఉపాధ్యక్షుడు డి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

భర్త అదృశ్యంపై భార్య ఫిర్యాదు

పెనమలూరు: భర్త అదృశ్యమయ్యాడని భార్య ఫిర్యాదు చేయటంతో పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ గోవిందరాజు తెలిపిన వివరాల ప్రకారం... కానూరు సద్దిక్‌నగర్‌కు చెందిన షేక్.లతీఫ్ బాషా గతంలో ఓ వ్యక్తి వద్ద అప్పు తీసుకున్నాడు. డబ్బు ఇచ్చిన వ్యక్తి అప్పు తీర్చమని ఒత్తిడి చేయటంతో అతను హైదరాబాద్‌లో ఉన్న మరో వ్యక్తి వద్ద అప్పుచేసి సొమ్ము తీసుకురావటానికి ఈ నెల 5వ తేదీన హైదరాబాద్‌కు వెళ్లాడు. అయితే అప్పటి నుంచి తిరిగి ఇంటికి రాలేదు. భార్య షేక్.రషీదా ఫోన్ చేస్తే భర్త ఫోన్ స్విచ్ఛాఫ్ వచ్చింది. దీంతో భార్య తన భర్త కనబడటం లేదని పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్‌కు గాయాలు

పెనమలూరు: పెనమలూరు సెంటర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్‌కు గాయాలు అవ్వటంతో పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. ఉయ్యూరు కాటూరు రోడ్డుకు చెందిన సోమన జమేష్ నున్న పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. తన డ్యూటీ ముగించుకుని బైక్ పై ఉయ్యూరుకు బయలుదేరాడు. పెనమలూరు సెంటర్ వద్దకు రాగా వెనుక నుంచి వచ్చిన బైక్ ఢీ కొట్టింది. ఈ ఘటనలో కానిస్టేబుల్ రోడ్డు పై పడిపోవటంతో గాయాలయ్యాయి. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

స్వచ్ఛమైన తాగునీటి సరఫరాకు చర్యలు

ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి



తాగునీటి పథకం శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి, చైర్మన్ నాని తదితరులు

ఉయ్యూరు: స్వచ్ఛమైన తాగునీటి సరఫరా లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. పట్టణంలోని 9, 10, 13, 14 వార్డులకు సంబంధించి తాగునీటి సమస్య పరిష్కారానికి రూ.97.13 లక్షలు అంచనా వ్యయంతో 2.50 లక్షలు లీటర్ల సామర్థ్యం గల మంచినీటి పథకం నిర్మాణ పనులకు బుధవారం శంకుస్థాపన చేశారు. మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణతో కలిసి ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి శిలాఫలకం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉయ్యూరు పట్టణ వాసులకు తాగునీటి సమస్య లేకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని చెప్పారు. క్రిమిరహిత తాగునీటిని అందించాలనే లక్ష్యంతో కృష్ణానది నుంచి నీటిని తీసుకొచ్చే ప్రణాళిక సిద్ధం చేసి త్వరలో పనులు ప్రారంభించేందుకు కృషి చేస్తున్నామన్నారు. వేసవి రీత్యా ఎక్కడా తాగునీటికి ఇబ్బందులు పడకుండా ముందస్తుగానే ప్రణాళికాబద్ధంగా నీటి సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వైస్ చైర్మన్‌లు సోలే సురేష్‌బాబు, అర్షతున్నీసాబేగం, ఆయా వార్డుల కౌన్సిలర్లు ఊర శ్రీవాణి, కూరాడ వెంకటలక్ష్మి, పైలా శ్రీనివాసరావు, కమిషనర్ వెంకటేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజులపాటి రామచంద్రరావు, ఉయ్యూరు ప్రభుత్వాసుపత్రి చైర్మన్ జంపాన కొండలరావు, షేక్ ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

కాలువ కట్టలు అభివృద్ధి చేస్తాం

పెనమలూరు: పేదలు నివశిస్తున్న కాలువ కట్టల అభివృద్ధికి కట్టుబడి ఉన్నానని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ ఎదురుగా ఉన్న వంతెన వద్ద శ్రీనివాసనగర్ కాలువ కట్ట పై సీసీ రోడ్డు రూ.88.57 లక్షలతో నిర్మాణానికి బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పేదలు నివశించే కాలనీలు, కాలువ కట్టల పై అభివృద్ధి పనులు చేశామని చెప్పారు. తాడిగడప పరిధిలో ఇప్పటికి మూడు కాలువ కట్టల పై దాదాపు రూ.2 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణం చేశామన్నారు. మిగతా కట్టల పై కూడా సీసీ రోడ్ల నిర్మాణం చేస్తామని, తాగునీరుకు వాటర్‌ట్యాంకులు కూడా నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారు. టీడీపీ పాలనలో కాలువ కట్టల పై నివశించే వారు ఇళ్లు పోతాయని రోజూ ఆందోళన చెందారన్నారు. జగనన్న పాలనలో భరోసాతో కాలువ కట్ట ప్రజలు ఉన్నారని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం సంక్షేమం–అభివృద్ధి రెండు కళ్లుగా పని చేస్తుందని తెలిపారు. కమిషనర్ ఎస్.ప్రకాశరావు, డీఈ రాజారావు, విజయవాడ నగర పార్టీ అధ్యక్షుడు బొప్పన భవకుమార్, నేతలు శ్రీనివాస రెడ్డి, నర్రాచంటి, కె.బ్రహ్మం, పీజె.కిషోర్, షేక్.ఖాదర్‌బాషా, స్థానికులు, వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాలే కొండంత అండ

గడప గడపకు మన ప్రభుత్వంలో లబ్ధిదారులు



లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బుక్‌లెట్‌లు అందిస్తున్న ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి

పెనమలూరు: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే తమకు కొండంత అండగా ఉన్నాయని, భవిష్యత్తులో కూడా జగనన్న పాలనే కావాలని లబ్ధిదారులు టి.శివాలక్ష్మి, బ్రహ్మేశ్వర రావు కోరారు. తాడిగడప రామానగర్‌కాలువ కట్టపై బుధవారం ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. సంక్షేమ పథకాల బుక్‌లెట్‌లు అందచేసి స్థానిక సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులు మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న అమ్మఒడి, చేయూత, ఆసరా, కాపునేస్తం, ఆరోగ్యశ్రీ తదితర సంక్షేమ పథకాలతో తమకు ఎంతో లబ్ధి చేకూరుతుందని చెప్పారు. ప్రభుత్వ పథకాలపై కొన్ని పార్టీలు, వారి మద్దతు దారులు చేస్తున్న అసత్య ప్రచారం సరైనది కాదన్నారు. జగనన్న పాలనలో అన్నివర్గాల ప్రజలకు పూర్తి న్యాయం జరుగుతుందని, వాస్తవ పరిస్థితులు ప్రతి ఒక్కరూ తెలుసుకుని జగనన్నకు అండగా ఉండాలని ఎమ్మెల్యే పార్థసారథి కోరారు. రాజకీయాలు, కుల మతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని చెప్పారు. పేదలు బాగుపడుతుంటే ప్రతిపక్షాలు ఓర్వలేక పోతున్న విషయాన్ని గమనించాలని సూచించారు. ప్రజల అండ దండలతో సంక్షేమ పథకాలు కచ్చితంగా అమలు చేస్తామన్నారు. కమిషనర్ ఎస్.ప్రకాశరావు, వైఎస్సార్ సీపీ నేతలు హనుమంతరావు, వెలిశిల ప్రసాద్, నర్రా చంటి, ఖాదర్‌బాషా, పీజె కిషోర్, పి.వెంకన్న, వేమూరి బాలకృష్ణ, క్రిష్టోఫర్, బ్రహ్మం, అంగిరేకుల సీతారామయ్య, ఈదా రాజేష్, వల్లే నరసింహారావు, పిన్నబోయిన రవి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం



అంగన్‌వాడీ కేంద్రం వద్ద శిలాఫలకం ఆవిష్కరణలో ప్రజాప్రతినిధులు

హనుమాన్‌జంక్షన్ రూరల్: గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఏపీ నాటక అకాడమీ డైరెక్టర్ నక్కా గాంధీ తెలిపారు. బాపులపాడు మండలం ఆరుగొలను, కానుమోలు గ్రామంల్లో నూతనంగా నిర్మించిన మూడు అంగన్‌వాడీ కేంద్రం భవనాలను బుధవారం ఆయన ప్రారంభించారు. ఒక్కో భవనాన్ని రూ.14 లక్షల వ్యయంతో నాబార్డు, మండల పరిషత్ నిధుల సాయంతో వీటిని నిర్మించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రతి గ్రామంలోనూ గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, ఆరోగ్య ఉప కేంద్రాలకు నూతన భవనాలను నిర్మించారని నక్కా గాంధీ తెలిపారు. జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవాని, ఎంపీపీ యర్రగొర్ల నగేష్, గన్నవరం ఏఎంసీ డైరెక్టర్ వసుపులేటి మురళి, ఎంపీటీసీ సభ్యుడు దేవంభొట్ల పురుషోత్తమశర్మ, సర్పంచ్ మూల్పూరు శ్రీలక్ష్మి, పీఏసీఎస్ చైర్మన్ మూల్పూరు ప్రభుకాంత్, ఐసీడీఎస్ అధికారులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విజయవాడ ఐసీడీఎస్ ప్రాజెక్టు–2 పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో కార్యకర్తలు, ఆయా పోస్టులు, మినీ అంగన్‌వాడీ కార్యకర్త పోస్టుల భర్తీకి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు సీడీపీఓ జి.మంగమ్మ ప్రకటనలో తెలిపారు. విజయవాడ ప్రాజెక్టు –2 పరిధిలోని 11వ డివిజన్ జార్జిపేటలో అంగన్‌వాడీ కార్యకర్త ఓసీ కేటగిరి, 2వ డివిజన్ మనవరం –1 నందు ఎస్సీ కేటగిరి, 14వ డివిజన్ శ్రీనివాస్ నందు ఓసీ కేటగిరి, 16వ డివిజన్ మధురానగర్ బీసీ–డి కేటగిరి, 17వ డివిజన్ ద్వారకానగర్ నందు ఎస్టీ కేటగిరి, రాణిగారితోట–2 నందు ఓసీ కేటగిరి, 22వ డివిజన్ డ్రైవర్ పేట–2 నందు బీసీ–బి కేటగిరికి కేటాయించామన్నారు. గొల్లపూడి, రామవరప్పాడు నందు ఓసీ కేటగిరి అభ్యర్థులకు అంగన్‌వాడీ సహాయకురాలు పోస్టులను కేటాయించడం జరిగిందన్నారు. ప్రసాదంపాడు –8 నందు మినీ అంగన్‌వాడీ కార్యకర్తల పోస్టులను భర్తీ చేసేందుకు ప్రభుత్వం అనుమతి మంజూరు చేయడం జరిగిందన్నారు. అంగన్‌వాడీ కార్యకర్త, మినీ అంగన్‌వాడీ పోస్టులకు 21 నుంచి 35 ఏళ్ల లోపు వయస్సు కలిగి 10వ తరగతి ఉత్తీర్ణత పొందిన వారు అర్హులని పేర్కొన్నారు. వివాహితురాలై స్థానికంగా ఉండాలన్నారు. దరఖాస్తులను ఏప్రిల్ 4వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు పెనమలూరు మండలం కానూరు కార్యాలయంలో వ్యక్తిగతంగా అందజేయాలని మంగమ్మ కోరారు.

కంటి సమస్యల పరిష్కారానికి కృషి



కంకిపాడు: కంటి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఉప్పలూరు పీహెచ్‌సీ ఆప్తాలమిక్ ఆఫీసర్ వివి రాజేష్‌కుమార్ తెలిపారు. కంకిపాడు సచివాలయంలో డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం బుధవారం నిర్వహించారు. 120 మంది వృద్ధులకు కంటి పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. ఆప్తాలమిక్ ఆఫీసర్ రాజేష్‌కుమార్ మాట్లాడుతూ దృష్టిలో పాలు, కంటి సమస్యలను ప్రాథమికంగానే గుర్తించి అవసరమైన చికిత్సలు చేయించుకోవాలని సూచించారు. ప్రభుత్వం అవ్వాతాతల ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యం ఇస్తుందని పేర్కొన్నారు. కంటి వెలుగు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వైద్య సిబ్బంది మంజు ఫిల్మేనా, యు.శిరీష, వి.దుర్గ, వి.పార్వతి పాల్గొన్నారు.

40 మందికి కంటి పరీక్షలు

గన్నవరం రూరల్ : వైఎస్సార్ కంటి వెలుగు పథకం ప్రజలు వినియోగించుకోవాలని మాదలవారి గూడెం సచివాలయం కార్యదర్శికి కేవీ రాజశేఖర్ సూచించారు. బుధవారం చనుపల్లివారిగూడెంలో ఏర్పాటైన వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమంలో 40 మందికి డాక్టర్ మల్లిఖార్జున్ పరీక్షలు నిర్వహించి ఉచితంగా కళ్లజోళ్లు అందించేందుకు చర్యలు తీసుకున్నారు. ఏఎన్ఎం మేరీగ్రేస్ పాల్గొన్నారు.

జెడ్పీ హైస్కూల్‌కు వితరణ

హనుమాన్‌జంక్షన్ రూరల్: గ్రామీణ ప్రాంత విద్యార్థులు పట్టుదల, ఆత్మవిశ్వాసంతో చదివితే ఎంతటి లక్ష్యాన్నైనా సాధించగలరని బ్యాంక్ ఆఫ్ బరోడా రేమల్లె బ్రాంచ్ మేనేజర్ ఎల్.ప్రశాంత్ అన్నారు. బాపులపాడు మండలం రేమల్లెలోని జెడ్పీ హైస్కూల్‌కు రూ.15 వేల విలువైన టీచింగ్ డెస్క్‌లను బ్యాంక్ ఆఫ్ బరోడా తరఫున బుధవారం పంపిణీ చేశారు. కార్పొరేట్ సామాజిక బాధ్యత కార్యక్రమాల్లో భాగంగా బ్యాంక్ ఆఫ్ బరోడా వీటిని పాఠశాలను అందించినట్లు బ్రాంచ్ మేనేజర్ ప్రశాంత్ తెలిపారు. విద్యార్థులు కష్టపడి చదవాలని, విద్యలో రాణించటం ద్వారా జీవితంలో ఉన్నత శిఖరాలను చేరుకోగలమని చెప్పారు. విద్యార్థులకు పొదుపు ఖాతా ఉండాలని సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు దుగ్గిరాల ఝాన్సీరాణి, ఉపాధ్యాయులు దారపు రెడ్డి భాస్కరరావు, వెలమర్తి రవిబాబు, మంజులత, రవికిషోర్, రాజేష్ పాల్గొన్నారు.

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ



ఉయ్యూరులో సామాజిక తనిఖీ నిర్వహిస్తున్న అధికారుల బృందం

ఉయ్యూరు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనులు సంతృప్తికరంగానే ఉన్నాయని సామాజిక తనిఖీ అధికారి, మచిలీపట్నం ఏపీడీ శ్రీలత అన్నారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద ఉపాధి హామీ పథకం 2020–21 సంవత్సరానికి గానూ చేపట్టిన పనులపై సామాజిక తనిఖీ బుధవారం నిర్వహించారు. గ్రామాల వారీగా చేపట్టిన పనులు, వెచ్చించిన నిధులు, పనుల వాస్తవ స్థితి, రికార్డుల నమోదు అంశాలను పరిశీలించారు. శ్రీలత మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో ఉపాధి పనులను తనిఖీ చేశామన్నారు. రూ.2.53 కోట్ల పనులకు సంబంధించి కొన్ని లోటుపాట్లను గుర్తించామన్నారు. రూ. 1.31 లక్షలు రికవరీ చేయాలని ఆదేశించామన్నారు. రికవరీకి సంబంధించిన పనులపై ఆయా గ్రామాల అధికారులు, సిబ్బంది సమగ్ర రికార్డులను సమర్పిస్తే జరిమానా చెల్లించాల్సిన అవసరం ఉండదన్నారు. ప్రభుత్వం చేపట్టిన పనులు అన్నీ సంతృప్తికరంగానే ఉన్నాయన్నారు. ఉయ్యూరు డీఎల్‌డీవో నాంచారరావు, ఎంపీడీవో విమాదేవి, అధికారులు విజయలక్ష్మి, వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఐవీ బాధితులకు పౌష్టికాహారం పంపిణీ

గన్నవరం: హెచ్ఐవీ వ్యాధిగ్రస్తులను ఆదుకునేందుకు ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు ముందుకురావాలని చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీమ్ డిస్ట్రిక్ట్ రిసోర్స్ పర్సన్ సురేష్‌కుమార్ పిలుపునిచ్చారు. స్థానిక అట్లూరి శ్రీమన్నారాయణ హాల్లో బుధవారం ఎయిడ్స్ నియంత్రణ సంస్థ సహకారంతో చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీమ్ ఆధ్వర్యంలో హెచ్ఐవీ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం అందజేశారు. ఈ సందర్భంగా సురేష్‌కుమార్ మాట్లాడుతూ..హెచ్ఐవీ వ్యాధిగ్రస్తుల్ని ప్రేమతో ఆదరించాలని చెప్పారు. సీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ ఆర్. సింధూర మాట్లాడుతూ..హెచ్ఐవీ వ్యాధిగ్రస్తులు బలవర్ధకమైన ఆహారం తీసుకుని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. క్రమం తప్పకుండా ఏఆర్టీ మందులు వాడి జీవిత కాలాన్ని పెంచుకోవచ్చని తెలిపారు. మెడికల్ ఆఫీసర్ క్రాంతి, పిన్నమనేని సిద్ధార్థ ఆస్పత్రి కౌన్సిలర్ నాగరాజు, జోనల్ సూపర్‌వైజర్లు సుందరరావు, వెంకటేశ్వరరావు, లింక్ వర్కర్ సదాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తృణ ధాన్యాలతో ఆరోగ్యం



పెనమలూరు: తృణ ధాన్యాలతోనే ఆరోగ్యంగా జీవించవచ్చని అవగాహన కల్పిస్తూ ఎన్ఎస్ఎస్ విద్యారులు కానూరులో బుధవారం ర్యాలీ నిర్వహించారు. వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ ఎన్ఎస్ఎస్ విద్యార్థులు నిర్వహిస్తున్న ప్రత్యేక శిబిరంలో భాగంగా బుధవారం తృణ ధాన్యాల పై అవగాహన కల్పించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కొల్లా నరేంద్ర మాట్లాడుతూ వరి ధాన్యం ఆహారం కన్నా తృణ ధాన్యాలతో తీసుకునే ఆహారం ఆరోగ్యానికి మేలు చేస్తుందన్నారు.

రేపటి నుంచి శాస్త్రీయ సంగీతోత్సవాలు

విజయవాడకల్చరల్: స్వరఝరి 35వ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు శివరామకృష్ణ క్షేత్రంలో శాస్త్రీయ సంగీత మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు స్వరఝరి కార్యదర్శి మోదుమూడి సుధాకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం మల్లాది శివానంద యశస్విగాత్రం, శనివారం కొమ్మాజోస్యుల అలేఖ గాత్రం, ఆదివారం వయొలిన్ విద్వాంసుడు ద్వారం దుర్గాప్రసాద్‌కు చింతలపాటి లక్ష్మి స్మారక పురస్కారం అందిస్తామన్నారు. దుర్గాప్రసాద్ వాయులీన సంగీత కార్యక్రమం ఉంటుందని చెప్పారు.

ప్రతి వ్యక్తిలోనూ దైవత్వం

పత్రీజీ ధ్యాన సప్తాహం జిల్లా అధ్యక్షుడు చెన్నకేశవరావు



చెన్నకేశవరావు, మాస్టర్ నాగ రమాదేవిని సత్కరించిన పిరమిడ్ అభ్యాసకులు

గన్నవరం రూరల్: ప్రతి వ్యక్తిలోనూ దైవత్వం ఉందని, దానిని సాధించేందుకు సాధన అవసరమని బ్రహ్మర్షి పత్రీజీ ధ్యాన సప్తాహం జిల్లా అధ్యక్షుడు కె.చెన్నకేశవరావు అన్నారు. బుధవారం మండలంలోని ముస్తాబాద గీతా మందిరంలో గడచిన వారం రోజులుగా సీనియర్ పిరమిడ్ మాస్టర్ ఎం.నాగ రమాదేవి ఆధ్వర్యంలో జరుగుతున్న ధ్యాన సప్తాహం ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని అభ్యాసకులకు సందేశమిచ్చారు. శ్వాస మీద ధ్యాసతో అభ్యాసన చేయటం ద్వారా ధ్యానం అలవాటు అవుతుందని, తద్వారా అనేక ప్రయోజనాలు కలుగుతాయని వివరించారు. అందరూ సమానమేనని, వ్యత్యాసాలు కేవలం కల్పితాలని, వీటిని సాధన ద్వారా తెలుసుకోవాలని పేర్కొన్నారు. ఆరోగ్యం, ఆనందం, ఆత్మ జ్ఞానం సాధించి అభ్యాసకులు ఆదర్శంగా నిలవాలని, ధ్యాన సాధనకు మార్గదర్శకులుగా రాణించి అనేక మందికి స్ఫూర్తి కావాలని కోరారు. ఈ సందర్భంగా ఆయనను పిరమిడ్ ధ్యాన అభ్యాసకులు కొల్లి లక్ష్మీపతి, గరిమెళ్ళ శ్రీలక్ష్మి, కళ్యాణి, ఆవుటపల్లి పార్థసారథి గంధంతో, శాలువాలతో సత్కరించారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



సదస్సులో పాల్గొన్న అధికారులు

పెనమలూరు: మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని కృష్ణా జిల్లా వికలాంగుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు బి.రామ్‌కుమార్ అన్నారు. కానూరు పీవీపీ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో బుధవారం డ్రగ్ ఫ్రీ ఇండియా పైసదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత ఉన్నత శిఖరాలకు ఎదగాలన్నా, దేశం ప్రగతి సాధించాలన్నా మాదకద్రవ్యాలను నిర్మూలించాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందచేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కొండపల్లి శివాజీబాబు, ఎస్ఈబీ ఎస్సై యుగంధర్, సైకాలజిస్టు డాక్టర్ జి.శంకరరావు, కోఆర్డినేటర్లు శ్రావణి, కృష్ణకుమారి పాల్గొన్నారు.

రాములోరి కల్యాణానికి సిద్ధం...



ముస్తాబైన సీతారామ లక్ష్మణ సమేత ఆంజనేయస్వామి విగ్రహాలు

రాములోరి కల్యాణానికి గ్రామాలు ముస్తాబయ్యాయి. శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని గ్రామాల్లోని రామాలయాలు, ప్రధాన కూడళ్లలో చలువ పందిళ్లను ఏర్పాటుచేసి సీతారాముల కల్యాణానికి సర్వం సిద్ధం చేశారు. రాజస్థాన్ నుంచి వలస వచ్చిన ఓ కుటుంబం కొద్ది రోజులుగా సీతారాములు, లక్ష్మణ, ఆంజనేయ స్వామి విగ్రహాలు, ఇతర దేవతామూర్తుల విగ్రహాలను తయారుచేసి విక్రయిస్తుంది.

– కంకిపాడు

అరుణహోమం సర్వ శ్రేయోదాయకం



హోమం నిర్వహిస్తున్న దెందుకూరి సుబ్రహ్మణ్యం, రుత్వికులు

విజయవాడకల్చరల్: అరుణహోమం సర్వ శ్రేయోదాయకమని దెందుకూరి సుబ్రహ్మణ్య ఘనాపాటి అన్నారు. శృంగేరీ పీఠపాలిత శివరామకృష్ణ క్షేత్రం(రామకోటి)లో భారతీ తీర్థ మహాస్వామి 73 జన్మదిన వేడుకల సందర్భంగా 73 రోజులుగా నిర్వహిస్తున్న సూర్యార్చన, మహాసౌరం అరుణం, సౌరాక్షరీ మంత్ర జపం, సూర్య నమస్కారాలు బుధవారంతో ముగిశాయి. చివరి రోజు కార్యక్రమంలో లోక శాంతి, ఆయు ఆరోగ్యం కోసం అరుణహోమం నిర్వహించారు. హోమాన్ని ప్రారంభించిన అనంతరం సుబ్రహ్మణ్య ఘనాపాటి మాట్లాడుతూ.. సూర్యాహోమంతో దీర్ఘకాలిక రోగాల నుంచి విముక్తి కలుగుతుందన్నారు. శృంగేరీ పీఠ ఉత్తరాధికారి విదుశేఖర భారతి స్వామి సూచనతో కార్యక్రమం నిర్విఘ్నంగా నిర్వహించినట్లు తెలిపారు. రుత్వికులు వైభవంగా వేదస్వస్తి, గురు వందనంతో ప్రారంభించి ఆగమయుక్తంగా అరుణ హోమం జరిపారు. శివరామకృష్ణ క్షేత్రం ధర్మాధికారి శిష్టా హనుమత్ ప్రసాద్, సభ్యుడు గండూరి చంద్రమౌళీశ్వర శర్మ రుత్వికులను సత్కరించారు.

సెలవు రోజుల్లోనూ పన్ను చెల్లింపులకు అవకాశం

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరపాలక సంస్థకు చెల్లించాల్సిన పన్నులను నగర వాసులు సెలవు రోజుల్లోనూ చెల్లించేందుకు అవకాశం కల్పించామని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. గురువారం శ్రీరామనవమి సందర్భంగా సెలవు ఉన్నందన పన్ను చెల్లింపుదారులకు అనువుగా నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన నగదు చెల్లింపు కౌంటర్లు పని చేస్తాయన్నారు. నగరపాలక సంస్థ మూడు సర్కిల్స్ కార్యాలయాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. ఆస్తి, నీటి, ఖాళీ స్థలం పన్నులు, డీఅండ్ఓ ట్రేడ్ లైసెన్స్ ఫీజులు చెల్లించి నగరపాలక సంస్థ అభివృద్ధికి సహకరించాలని కమిషనర్ కోరారు.